క్లుప్తంగా

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలి



తెనాలిఅర్బన్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని పలువురు జనసేన పార్టీ నాయకులు కోరారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన దాడికి నిరసనగా మార్కెట్ వద్ద శుక్రవారం శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడి నుంచి మార్కెట్ వంతెనపైకి చేరుకుని మానవహారంగా ఏర్పడి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుడికి ఆర్థిక సాయం



తెనాలిఅర్బన్: మారీసుపేట శాంతినగర్‌లో నివాసిస్తున్న పేద రిక్షా కార్మికుడు పోలిమట్ల చంటికి సొపాటి కిరణ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేలు నగదు, బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు చిలకా కిరణ్ మాదిగ మాట్లాడుతూ చంటి సుమారు 40 ఏళ్ళపాటు రిక్షాను తొక్కుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల పక్షవాతంతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యారని చెప్పారు. కుటుంబ పోషణ కష్టమవడంతో సొపాటి కిరణ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అత్తోట ప్రసాద్, వింజమూరి ఏసురాజు, దొప్పలపూడి శ్యామ్, కోపల్లె శ్రీనివాసరావు, రావూరి ఆనంద్, చావలి ఆకుల్‌నాథ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్ల ఏర్పాటు



తెనాలిరూరల్: పట్టణ మార్కెట్ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన నటరాజ్ జ్యుయలర్స్ అధినేత కొత్మాసు కుమార్ బారికేడ్లను తయారు చేయించి పోలీసులకు అందజేశారు. వీటిని మార్కెట్ వంతెన కూడలిలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వీటిని శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ట్రాఫిక్ సిబ్బందికి నూతన వస్త్రాలు (యూనిఫాం) అందజేశారు. అలానే పోలీసు శాఖ తెనాలిలోని ఆటోలకు కేటాయించిన క్యూఆర్ కోడ్‌తో కూడిన సీరియల్ నంబర్ల స్టిక్కర్లను ఆటోడ్రైవర్లకు మంత్రి అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డీఎస్పీ బి.జనార్దనరావు, సీఐలు రాములనాయర్, ఆర్. ఉమేష్, రమేష్ బాబు, మల్లికార్జునరావు ఇతర అధికారులు ఉన్నారు.

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన



తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వివేకానంద సెంట్రల్ స్కూలులో విద్యార్థినులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ లక్షణాలు, ముందుగానే గుర్తించడాన్ని సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించారు. ఈ క్యాన్సర్ నివారణకు అందుబాటులోకి వచ్చిన హెచ్‌పీవీ వ్యాక్సిన్, ఏయే వయసులో ఆ వ్యాక్సిన్ తీసుకోవచ్చనే అంశాలను తెలియజేశారు. విద్యార్థినుల సందేహాలకు సమాధానాలిచ్చారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు మాట్లాడుతూ డాక్టర్ శారద వైద్యరంగంలో సమాజానికి చేస్తున్న విలువైన సేవలను కొనియాడారు. విద్యార్థులు కూడా సేవాభావాన్ని అలవరచుకోవాలని సూచించారు. వేజళ్ల ఉమామహేశ్వర్, ఎస్.రవికుమార్, శ్రీనివాసరావు, ప్రసాద్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక సహాయం

బేతపూడి(మంగళగిరి): నగర పరిధిలోని బేతపూడిలో ఇటీవల ప్రమాదవశాత్తూ గేదెలు మృతి చెందగా ఆ రైతులకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహాయం అందజేశారు. పోతినేని శ్రీనివాసరావు, సంకా బాలాజీ గుప్తా, తోట పార్థసారథి, నందం అబద్దయ్య పాల్గొన్నారు.

నీవెవరవు తల్లీ!

- 13 నెలలైనా తెలియని మృతురాలి జాడ
- సంగంజాగర్లమూడి డంపింగ్ యార్డులో కాలిపోయిన మహిళ మృతదేహం
- పోలీసులకు అంతుచిక్కని మిస్టరీ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది (ఫైల్)

తెనాలిరూరల్: అనుమానాస్పద మృతి కేసులో మృతురాలి ఆచూకీ 13 నెలలైనా పోలీసులు గుర్తించ లేకపోతున్నారు. డంపింగ్ యార్డులో 85 శాతంకు పైగా కాలిపోయిన మహిళ మృతదేహానికి సంబంధించి ఇప్పటికీ చిన్న ఆధారమైనా దొరకలేదు. పోలీసులకు సవాలుగా మారిన కేసు వివరాలిలా ఉన్నాయి. తెనాలి– గుంటూరు ప్రధాన రహదారి మార్గంలో సంగం జాగర్లమూడి వద్ద 2024 మార్చి 31వ తేదీ ఉదయం ఓ గుర్తు తెలియని యువతి మృతదేహం వెలుగు చూసింది.

శ్రీ సంగమేశ్వర స్వామి వారి దేవస్థానానికి వెళ్లే మార్గంలో పంచాయతీ డంపింగ్ యార్డ్ వద్ద పూర్తిగా కాలిపోయిన స్థితిలో సుమారు 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉండటం గ్రామంలో కలకలం సృష్టించింది. డంపింగ్ యార్డు వ్యర్థాల మధ్యలో ఒంటిపై దుస్తులతో సహా పూర్తిగా కాలిపోయి కనీసం గుర్తు పట్టలేని విధంగా మహిళ మృతదేహం బోర్లా పడి ఉండటాన్ని గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది గుర్తించి వెంటనే తెనాలి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అప్పటి డీఎస్పీ ఎం.రమేష్, రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ పి.కోటేశ్వరరావులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

స్థానికుల సహా పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే క్లూస్ టీంకు, డాగ్ స్క్వాడ్‌కు సమాచారం ఇచ్చి రంగంలోకి దింపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీం సిబ్బంది, డాగ్ స్క్వాడ్ ఆధారాలు సేకరించే ప్రయత్నం చేసినా సరైన ఆధారాలు లభించలేదు. కనీసం మృతురాలు ఎవరు, ఏ ప్రాంతానికి చెందిన మహిళ అన్న వివరాలూ తెలియలేదు. మృతదేహం కుడి చేతికి 10 గాజులు, ఎడమ చేతికి పింక్ రంగు వాచ్, మేడలో తాడుకు వెంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి బొమ్మలు కలిగిన బిళ్ళ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలు ఎరుపు రంగు పంజాబీ డ్రస్ వేసుకుని ఉన్నట్లు భావిస్తున్నారు. ఎత్తు మాత్రం కేవలం ఐదడుగులు లోపు మాత్రమే ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ఇప్పటికీ దొరకని ఆధారం..

ఈ కేసులో ఇప్పటికీ చిన్న ఆధారం దొరకలేదు. మృతదేహాన్ని గుర్తించిన సందర్భంలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండడం, నెలన్నరలో ఎన్నికలు జరగడంతో అప్పట్లో పోలీసులు ఎన్నికల విధులతో బిజీగా ఉండడంతో ఈ కేసు దర్యాప్తు కొంత వెనుకబడింది. ఎన్నికలైన అనంతరం కేసుపై దృష్టి సారించినా ఏ ఒక్క ఆధారమూ లభించ లేదు. హిజ్రా అయి ఉండవచ్చని అప్పట్లో భావించారు. ఘటన జరిగిన నాటి నుంచి ఇప్పటి వరకు ముగ్గురు సీఐలు, ముగ్గురు ఎస్‌ఐలు మారారు.

కేసు దర్యాప్తులో ఉంది



సంగంజాగర్లమూడి డంపింగ్ యార్డులో మహిళ మృతదేహం కేసు దర్యాప్తులో ఉంది. ఘటన జరిగినప్పుడు ఉన్న అధికారులు ఎంతో కృషి చేశారు. అయినా ఆధారాలు దొరకలేదు. ఈ కేసు విషయం నా దృష్టిలో ఉంది. దర్యాప్తు వేగవంతం చేస్తాం.

–ఆర్.ఉమేష్, రూరల్ సీఐ

మలేరియాపై అవగాహన ఏర్పరచుకోండి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈ.అన్నపూర్ణ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: మలేరియా వ్యాధిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని తెనాలి డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాత ప్రభుత్వ వైద్యశాల వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2030 నాటికి భారతదేశాన్ని మలేరియా హిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు పని స్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ 1880 సంవత్సరంలతో చార్లెస్ లెవరన్ అనే శాస్త్రవేత్త మలేరియాను కనుగొన్నట్లు తెలిపారు. ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు వలన ఇది వస్తుందని తెలిపారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి, సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, నర్సింగ్ విద్యార్థినీలు, ఆశా కార్యకర్తలు, మలేరియా, ఫైలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం

తెనాలిఅర్బన్: డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని శనివారం ఉదయం 10.30 నుంచి 11.30 వరకు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొనే సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయవచ్చన్నారు. సెల్ నెంబర్:99592 25422లో సంప్రదించగలరు. ఈ అవకాశాన్ని తెనాలి పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కొల్లిపర: భర్త, అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వల్లభాపురంకు చెందిన చప్పిడి సంధ్యారాణికి ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. భర్త, అత్త, మామ తీవ్ర మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తుండడంతో మనస్తాపానికి గురై గురువారం ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను కుటుంబసభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సమాచారమందుకున్న కొల్లిపర ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు వైద్యశాలకు వెళ్లి బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కేసు నమోదు చేసినట్టు శుక్రవారం వెల్లడించారు.

బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌కు ప్రశంసాపత్రం



బాపట్ల: 'రాష్ట్రీయ గ్రామీణ స్వశక్తీకరన్ అభియాన్' పథకం కింద అత్యధిక శిక్షణ కార్యక్రమాలు చేపట్టినందుకు బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్‌ను ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి సాయిబాబు, సభ్యులు ఎం.నరసింహారావు, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, ఫ్యాకల్టీ సభ్యులు కె.లలిత, పి.రామకృష్ణ, జి.నాగేశ్వరరావు సన్మానించారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోండి

తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో దీప్తి

తెనాలిఅర్బన్: క్రమశిక్షణతో కూడిన విద్యను అందరూ అలవర్చుకోవాలని తెనాలి తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, ఎంపీడీవో ఎ.దీప్తిలు పేర్కొన్నారు. సెయింట్ పాల్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్ వార్షికోత్సవ వేడుకలను కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాల్య దశలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాటిని సాధించే దిశగా ప్రయత్నించాలని చెప్పారు. అనంతరం పదోవ తరగతిలో 282 మార్కులు సాధించిన ఆర్.దత్తు, వి.నిఖిల్‌కు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకులు ఎండీ చావలి, డైరెక్టర్లు చావలి తేజోనాథ్, చావలి ఆకుల్‌నాథ్, ప్రిన్సిపల్ దివ్యతేజ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పాల్గొనండి



సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జూన్ మొదటి వారంలో విజయవాడలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తెనాలి తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశాన్ని జిల్లా వైద్యశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని ఆయన కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులు, విశ్రాంత, కాంట్రాక్ట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు పోతురాజు, నాగేశ్వర రావు, తెనాలి యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సుధీర్‌బాబు, మరియదాసు, విజయ్‌కుమార్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సామర్థ్యం అంచనాపై సమగ్ర సర్వే



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కమిషనర్ బండి శేషన్న

తెనాలిటౌన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని పొడి చెత్తను సేకరించే అసంఘటిత కార్మికుల వ్యక్తిగత వివరాలు, సామర్థ్య అంచనా కోసం సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకానిజెడ్ శానిటేషన్ ఎకో సిస్టం పథకం అనేది పొడి వ్యర్థాలను సేకరించే వారి కోసం పారిశుధ్య కార్మికులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు పీపీఈ కిట్లు, సామాజిక భద్రత, ఆర్థిక చేరిక, ఆరోగ్య ప్రయోజనాలు, నైపుణ్య మెరుగుదలపై శిక్షణ అందించడం ద్వారా వారి సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన పథకం నమస్తే పేరిట ఎన్యూమరేషన్ నిర్వహించేందుకు యాప్‌ను పెంపొందించారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ అనే స్వచ్ఛంద సంస్థ గుంటూరు జిల్లాల్లో ఎన్యుమరేషన్ చేపట్టనున్నది. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్న బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రావు, హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, డీబీఆర్‌సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హైర్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె రూరల్: హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ కోరారు. మదర్ థెరిస్సా హైర్ బస్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం డిపో మేనేజర్ సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. హైర్ బస్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా ఐడీ కార్డులు, పీఎఫ్, ఈఎస్‌ఐను అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ డిపోలో హైర్ బస్సు డ్రైవర్లగా పనిచేస్తున్న కార్మికులు రోజురోజుకి పెరిగిపోతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.వెంకట నాగ గోపి, రవికుమార్, ఎస్కే ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిమిత వేగంతో ప్రయాణించాలి



ఆటో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటశివకుమార్

చందోలు(కర్లపాలెం): పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్య స్థానాలను చేరాలని చందోలు ఎస్‌ఐ ఎం.వెంకటశివ కుమార్ చెప్పారు. శుక్రవారం పిట్టలవానిపాలెం మండలంలోని రెడ్డిపాలెం టోల్‌ప్లాజా సమీపంలో ఎస్‌ఐ తమ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర మోటారు వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని ఎస్‌ఐ తెలిపారు. ఆటోలలో పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించవద్దని పరిమిత వేగంతోనే వాహనాలు నడపాలని ఆటో డ్రైవర్లకు, ప్యాసింజర్లకు చెప్పారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలన్నీ వాహనంలో ఉంచుకోవాలని ఎస్‌ఐ అన్నారు.

ఉదాసీనంగా పనిచేస్తే సహించను

మున్సిపల్ అధికారులపై మంత్రి మనోహర్ ఆగ్రహం



అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: మున్సిపల్ అధికారులు కొన్ని విషయాల్లో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు పనిచేసే విధానంలో పూర్తిగా మార్పు రావాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అధికారులతో సమీక్ష జరిపారు. మహిళా మండలి భవన ఆధునీకరణ పనుల జాప్యంపై కొంత అసహనం వ్యక్తం చేశారు. మే 1 నాటిని పనులన్నీ పూర్తవ్వాలని ఆదేశించారు. అలాగే తెనాలి పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. నెల రోజుల్లో పూర్తిగా వీధి కుక్కల నియంత్రణ జరగాలని సూచించారు. వీఎస్సార్ కళాశాల సమీపంలోని ఫైకాస్ పార్కు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. కొందరూ కాంట్రాక్టర్లు అభివృద్ధి పనుల విషయంలో జాప్యం చేస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తగిన హెచ్చరికలు జారీచేసి వారి పనిచేసే విధంగా చూడాలని సూచించారు. వేసవి సమీపించిన నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన మురుగు, పంట కాల్వల పూడికతీత పనులు మే 1న ప్రారంభించి నెలాఖారు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

అలాగే ఐతానగర్, మల్లెపాడు, సుల్తానాబాద్‌లో క్రైస్తవుల సమాధుల తోటకు స్థల సేకరణ జరపాలన్నారు. మధ్యలో ఆగిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్‌లు, మున్సిపల్ స్కూల్ నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలు తనకు అందజేయాలని, వాటిని పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. తెనాలి పట్టణ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా రూ.10 కోట్లు నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకురావడం జరిగిందన్నారు. జూన్ 1లోపు తెనాలి పురపాలక సంఘ కార్యాలయాన్ని ఖాళీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దానిని పడగొట్టి నూతన కార్యాలయాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. అలాగే స్కైవాక్‌ను కూడా నిర్మించేందుకు డిజైన్స్ రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఇన్‌చార్జ్ ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, మెప్మా సీఎంఎం విజయ కుమారి, ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీలు శివన్నారాయణ, వాణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

- చెంచుపేట జిల్లా వైద్యశాల వద్ద నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు, చెంచుపేటలోని రావి టవర్స్ వద్ద నిర్మించనున్న డ్రైయిన్ నిర్మాణ పనులు, బుర్రిపాలెం రోడ్డులో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులు, 8వ వార్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు మంత్రి మనోహర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్ధనరావు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులలో ర్యాలీగా వస్తున్న ప్రదర్శకులు

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ మానవత ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్ర దాడిలో మృతిచెందిన 26 మందికి సంతాపం తెలియజేస్తూ జరిపిన ఈ ర్యాలీలో పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. నెహ్రూరోడ్డులోని ఐలమ్మ రజక పార్కు నుంచి ప్రారంభమైన ర్యాలీ నెహ్రూ రోడ్డు, గాంధీచౌక్, బోసురోడ్డు నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సెంటరు వరకు కొనసాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. మృతులకు జోహార్లు అర్పించారు. పర్యాటకులపై ఉగ్రదాడిపై నిరసన వ్యక్తంచేశారు. ఉగ్రవాదాన్ని ఖండించాలనీ, పాక్ ప్రేరేపిత ఉగ్రవాద ముష్కరులను కఠినంగా శిక్షించాలనీ, దీనిపై కేంద్రప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, గుమ్మడి నారాయణరావు, లోక్‌సత్తా ఉద్యమసంస్థ నేత జి.శరత్‌చంద్ర, ఎం.అర్జునరావు, సుభాస్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

'హెల్త్ ఆన్ వీల్స్' ప్రాజెక్టు ఆరంభం

ప్రారంభించిన సబ్‌కలెక్టర్ సంజనా సింహ



హెల్త్ ఆన్ వీల్స్ వాహనంతో సంజనా సింహ, డాక్టర్ శారద ప్రభృతులు

తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 'హెల్త్ ఆన్ వీల్స్' ధర్మ వాహనాన్ని శుక్రవారం సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ వాహనంతో 24 గంటలు ఫస్ట్‌ఎయిడ్, గుండెపోటు సంబంధిత సేవలను అందిస్తారు. వీటితోపాటు మహిళల్లో క్యాన్సర్ స్క్రీనింగ్, హెచ్‌పీవీ వ్యాక్సిన్, పాప్‌స్మియర్ పరీక్ష వంటి సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద వెల్లడించారు. వీటితోపాటు హెల్త్ ఎడ్యుకేషన్, డైట్, న్యూట్రిషన్, ఒబెసిటీ అంశాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఎన్‌సీడీఎస్ వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారణకు కృషిచేయాలనేది లక్ష్యంగా వివరించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వివిధ యూనియన్లకు చెందిన ఉపాధ్యాయులు డీవీ సుబ్బారావు, రామచంద్ర, ఎస్.రవికుమార్, ప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, అనూరాధ పాల్గొన్నారు.

శాంతిభద్రతల విఘాతకులను దీటుగా ఎదుర్కొందాం



మసీదు వద్ద నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న మసీదు పెద్దలు

తెనాలిటౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కొందామని రాష్ట్ర ఇమానే మజ్లిస్ కమిటీ కార్యదర్శి షేక్ ఫరీద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీ అర్కమ్ మసీద్ వద్ద పహల్గాం ప్రాంతంలో ఉగ్రదాడిలో మరణించిన వ్యక్తులకు ఘన నివాళులర్పించారు.

అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఉగ్రదాడిని కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని మసీదు పెద్దలు ముక్త కంఠంతో నినదించారు. ఉగ్రమూకలను మట్టుపెట్టడంలో భారత సైన్యానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మౌలానా మసూద్ అహ్మద్, షేక్ షబ్బీర్, షేక్ సత్తార్, షేక్ మునీర్, తాజ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.